# 15. స్వేచ్ఛా పంజరం

సాధారణంగా నేను వేటి పైన మోజు పడను.

కాని, ఈ ప్రలోభానికి లోను కాని మానవుడుంటాడా అన్న సందేహం అప్పుడప్పుడు కలుగుతుంది.

నేనప్పుడు బి.యే. మొదటి సంవత్సరం చదువుతుండే వాడిని. మా తెలుగు లెక్చరరుగారు మరొక నెలలో రిటైరయిపోతున్నారు. వారికి నా యందు అమిత వాత్సల్యం. నేను తరచు వారి యింటికి పోయేవాడిని. అలమరాలో వారి పుస్తకాలు సర్దినట్లు, కావలసిన సరుకులు దుకాణం నుంచి తెచ్చినట్లు, సాధ్యమయినంత వరకు వారి పిలుపుకు అందుబాటులో ఉన్నట్లు వ్యవహరించేవాడిని.

వారి పుస్తకాల అలమరా సర్దుతున్నప్పుడు నా దృష్టి ఒక గ్రంథం మీద తరచు నిలిచేది. అది మేఘదూత కావ్యం. కలకత్తాలో ఎవరో దానిని ప్రకటించారు. పుస్తకంలో చాల వర్ణచిత్రాలున్నాయి. అంతే కాక మా గురువు గారు అచ్చు పేజీల మధ్యను తెల్ల కాగితాలు వేయించి దానిని తిరిగి బైండు చేయించారు. సంస్కృత శ్లోకాల మీద తెలుగు పద్యానువాదం, వివరంగా నోట్సు వ్రాసి ఆ పుస్తకాన్ని ఉత్తమంగా తీర్చారు.

అందులోని బొమ్మలు చాల ఆకర్షణీయంగా ఉండేవి. ప్రకృతి చిత్రాలు, యక్షిణి ఉన్న చిత్రాలు ఇంకా అద్భుతంగా ఉండేవి. అలమరా సర్దేటప్పుడు విధిగా ఆ పుస్తకాన్ని చూసి నిట్టూర్చే వాడిని. ఆ పుస్తకం తెప్పించుకుందామన్నా ఎక్కడ దొరకలేదు. ఒక వేళ పుస్తకం ఎక్కడో దొరికినా ఇన్ని వివరాలతో ఉండదు.

మా గురువుగారు నాకా పుస్తకంమీద నున్న గౌరవాన్ని గుర్తించినట్లున్నారు. తను రిటైరయిన తరువాత తప్పకుండా నాకే ఆ పుస్తకమిస్తానని ఒకరిద్దరి దగ్గిర అన్నారు కూడా. ఆ మాటలు విన్న తరువాత నా ఆనందం అవధులు దాటింది. నా వంటి అదృష్టవంతు డుండడని అనుకున్నాను. మా గురువు గారి ఔదార్యానికి ఎంతగానో మురిసి పోయాను.

రోజులు చాల వేగంగా గడచి పోయాయి. మా గురువు గారు రిటైరయారు. మంచి యిల్లు కట్టించుకున్నారు. అద్దె యింట్లోంచి స్వంత యింట్లోకి మారి పోయారు. ఆయన కాలేజీలో ఉద్యోగం చేసినప్పుడు ఏ విధంగా వాళ్లింటికి వెళ్ళే వాడినో, రిటైరయిన తరువాత కూడా అదే విధంగా వెళ్తుండే వాడిని. అద్దె యింటి నుంచి స్వంత యింటికి వారు మారినప్పుడు మరీహెచ్చుగా శ్రమపడ్డాను. మా గురువుగారిగదిలో సామానులు సర్దే బాధ్యత ఆయన నాకే విడిచి పెట్టారు.

అన్ని సామాన్లూ సర్దడమయింది. ఒక్క పుస్తకాల అలమరే మిగిలింది. అలమరాలోని పుస్తకాలు బస్తాల కెక్కించారు. ఇల్లు మారేటప్పుడు. వాటిని పైకి తీసి, దులిపి, మునుపు వాటిని సర్దిన క్రమంలోనే అన్నీ తిరిగి సర్దాను. ఏ అరలో, ఏ చోట ఏ పుస్తకముంటుందో నాకు తెలుసు. నాకు వారిస్తానన్న పుస్తకం అలమరాలోనున్న ఆరువందల పుస్తకాలలో కనిపించక పోగానే నేను చాల కంగారు పడ్డాను. పొరపాటున బస్తాల అడుగున ఉండిపోయిందేమోనని వాటిని దులిపి దులిపి వెదికాను. గుండెలు కొట్టుకుంటుంటే మా గురువు గారు బజారు నుండి వచ్చే వరకు కాచుకొని కూర్చున్నాను.

నా కలవర మంతా కప్పిపుచ్చి వారు సేదదీరి సుఖాసీనులయే వరకు ఓర్చుకున్నాను. తరువాత మాటల సందర్భంలో మేఘదూత మహాకావ్యం కనిపించలేదని వారికి మనవి చేశాను.

"అదేమిటోయ్ శంకరం! పుస్తకం లేకపోడమేమిటి? ఆ పుస్తకాలన్నీ మా బావమరిది కట్టలు కట్టి బస్తాలకెక్కించాడు కదా! పాత ఇంట్లో పూతిక పుల్ల కూడా విడిచిపెట్టలేదే!"

తరువాత ఆయనే పుస్తకాలన్నీ చూశారు. మా గురువమ్మగారిని పిలిచి అడిగారు.

"చూడు! ఈ పుస్తకాలలో నీలం రంగు కాలికో బైండు చేసిన పెద్ద పుస్తక మొకటిఉండేది. దని నిండా వర్ణ చిత్రాలున్నాయి. నేను మధ్యమధ్యలో నోట్సు రాసుకున్నాను."

"సైటర్లేని ఆడపిల్లల. బొమ్మలున్న పుస్తకమేనా? అరవయ్యో పడిలో పడ్డ మీ దగ్గిర ఎవరయినా ఈ పుస్తకం చూస్తే ఏమనుకుంటారు? సిగ్గు సిగ్గు!"

"అయితే ఏం చేశావు?"

"మా తమ్ముడు తనకిమ్మని అడుగుతే ఇచ్చేశాను"

అదీ కథ.

కాని, నాకా పుస్తకం మీద భ్రాంతి పోలేదు.

మరో నెల్లాళ్ళ తరువాత గురువు గారి బావమరది ఇంటికి వెళ్ళాను. అతని భార్య ఉంది. అర్జంటుగా ఒక పుస్తకం కావాలంటే ఆమె బీరువా తాళం చెవులిచ్చింది.

బీరువా తలుపులు తెరచి చూద్దును కదా! - ఆ పుస్తకం పీక నెవరో నులుముతున్నట్లు నాకనిపించింది. కాలికో బైండు చేసిన అట్టలు పీకేసి బలవంతంగా దానిని లోపలికి కుక్కారు. కాగితాలన్నీ నలిగిపోయాయి. గురువు గారి బావమరిదికో రబ్బరు స్టాంపున్నదని నాకంతవరకూ తెలీదు. - అతను ప్రతి కాగితం మీద, ప్రతి బొమ్మమీద విచక్షణారహితంగా తన స్టాంపు వేసి పుస్తకాన్ని నాశనం చేశాడు.

నేనెవరితో చెప్పుకొనేది?

* * *

సంగీత సాహిత్యాలకు విజయనగరం పెట్టిన పేరు.

నేను బియ్యే రెండవ ఏడు చదువుతుండే వాడిని.

సంగీతం మీద నాకు మనసయింది.

ఒక గురువు గారిని ఆశ్రయించి గాత్రం నేర్పమన్నాను.

ఒక నెల్లాళ్ళు ఆయన శ్రమపడి నా గళం సంగీతానికి సరిపడదని సెలవిచ్చారు. చిన్న బోయిన నా ముఖాన్ని చూసి ఆయన ఒక సలహా యిచ్చారు.

"శంకరం గారూ! గాత్ర సంగీతం రాకుండా పోయిందని విచారించడం దేనికి? వాద్య సంగీతం నేర్చుకొండి! అన్నింటికీ శాస్త్రమొకటే కదా!"

నిజమే! వాద్య సంగీతాలలో ఏది మంచిది?

హార్మోనియం, వీణ, వయోలిన్ ఈ మూడు చాల మంది నేర్చుకుంటారు. నాదస్వరం, క్లారినెట్, సాక్సోఫోను, మాండలిన్ ఈ విధంగా ఇంకా ఇంకా ఎన్నో వాద్యాలున్నాయి.

హార్మోనియం ఉత్తర దేశ సంగీతజ్ఞులు తప్ప కర్ణాటక సంగీత విద్వాంసులు ఆమోదించరు.

వీణ నేర్చుకునే తాహతు నాకు లేదు.

చివరకు వయోలిన్ నేర్చుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చాను.

గాత్రం నేర్చుకోడానికి ఏ పెట్టుబడి అక్కరలేదు.

వాద్యానికి విధిగా వయోలిన్ ఉండాలి.

వయోలిన్ కొనుక్కునే స్తోమత గలవాడిని కాను.

నా అసమర్థతకు నన్ను నేనే నిందించుకున్నాను.

మహామహులు విజయనగరంలో ఉండి నాకు కర్ణాటక సంగీతం నేర్పడానికి సుముఖులుగా ఉన్నా, ఆ సదవకాశాన్ని వినియోగించుకోలేక పోతున్నందుకు చాల బాధపడ్డాను.

కాని, కొద్ది రోజులలోనే నేను కోరుకున్న నిధి మా పక్కయింట్లోనే లభించింది. వెంకట్రావు పంతులు గారు మా యింటి పక్కనే ఉంటున్నారు. అతను తాలూకాఫీసులో పెద్ద గుమస్తాగా పనిచేస్తున్నారు. పన్నెండేళ్ళ కొడుకు, ఎనిమిదేళ్ళ కూతురు అతని కున్నారు. వాళ్ళ యింటికి సున్నాలు వేయిస్తున్నప్పుడు ఆ నిధి నా కళ్ళ సాక్షాత్కరించింది.

కప్పు సరిగా లేని పాత పెట్టిలో తీగలు లేని వయోలిన్ ఒకటి నా కళ్ళ బడింది. చిందర వందరగా పడేసిన సామానుల్లో అది కనిపించింది. దాని గురించి వివరాలు కనుక్కోడానికి వెంటనే రంగంలోకి దిగాను.

"అయ్యా, వెంకట్రావు గారూ! మీ యింట్లో వయోలిన్ ఉందని ఇవాళే తెలిసింది. చాల సంతోషం" అన్నాను నేను సంభాషణ ప్రారంభిస్తూ.

దానికాయన చిర్రున లేచి అన్నాడు. "అయితే ఏం చేయమంటావు?"

"మీకు సంగీతంలో మంచి ప్రవేశం ఉన్నందుకు ఇది తార్కాణం"

"ఓయ్! వెర్రి శంకరం! వయోలిన్ ఇంట్లో ఉన్నంత మాత్రాన సంగీతం వచ్చినట్లేనా?"

" సంగీతం రాక పోయినా, మీకా శాస్త్రం మీద అభిమానముంది."

"అభిమానమో, పాడో! నాకు సంగీతమంటేనే తలనొప్పి"

" మీ శ్రీమతి వాయిస్తారా?"

"ఆవిడకు అటువంటి కోరిక లేదు"

"మరి? ..."

అప్పుడాయన మూడ్ బాగున్నట్లుంది.

"మా అమ్మాయి వెంకటలక్ష్మి లేదూ ..."

"అవునవును ...."

ఆ అమ్మాయికి అయిదేళ్ళు కూడా లేవు

"దాని జాతకం వేసిన మా బావమరిది అది మాంచి సంగీత విద్వాంసురా లవుతుందన్నాడు. మాటల సందర్భంలో ఈ సంగతి ఒక పార్టీ చెవిని పడి, అది నెలల పిల్లగా ఉన్నప్పుడే అతను ఒక వయెలిన్ మా యింట పడేశాడు."

విషయం తెలిసిన తరువాత నేను చాల సంతోషించాను.

చిరంజీవి వెంకట లక్ష్మి వయోలిన్ నేర్చుకోడానికి ఇంకా పది సంవత్సరాల కాలం ఉంది. ఈలోగా నేను ఆ వయోలిన్‌ను బాగు చేయించి సంగీతం నేర్చుకోవచ్చు. డబ్బు కలిసి రాగానే కొత్తది కొని వాళ్ళ వయోలిన్ వాళ్ళకి పువ్వుల్లో పెట్టి ఇవ్వవచ్చు.

నా మనసులోని అభిప్రాయాన్ని వెంకటరావు గారికి చెప్పడమా మానడమా అని సంశయించాను. వయోలిన్ వంటిది వాడుకలో ఉంటే చెడిపోదు. లేకపోతే పాడవుతుంది. ఇంతకీ నా కా వాద్యాన్ని అచ్చంగా ఇమ్మనలేదు కదా!

మా క్లాస్ మేట్ తండ్రి ఒకతను వయోలిన్‌లు, వీణలు, తంబురాలు, హార్మోనియములు బాగు చేస్తారు. మా స్నేహితుడితో విషయం ప్రస్తావిస్తే అతడు నన్ను తిన్నగా వాళ్ళ నాన్నగారి దగ్గరికే తీసుకుపోయాడు. అతని పేరు ఆదినారాయణ.

ఆదినారాయణ గారు నేను చెప్పిన వివరాలన్నీ విని ప్రశ్నించారు

"శంకరం! నువ్వు చూసిన వయోలిన్ ఎక్కడ తయారయింది?"

"దానిమీద జర్మనీ అని రాసి ఉంది."

"మరేం! చాల మంచి వయోలిన్. దానికి ఏయే భాగాలు లేవు?"

"తీగలు లేవు. బ్రిడ్జి లేదు. ఇంకా కమానుకి గుర్రపు వెంట్రుకలు లేవు"

"ఇవేనా! తీగలు కొనుక్కోవచ్చు. చాల తక్కువ వెలకే దొరకుతాయి. నా దగ్గర పాత బ్రిడ్జి దొరుకుతుంది. ఈ మధ్య రెండు కమాన్లకు గుఱ్ఱపు వెంట్రుకలు తీసేసి నైలాన్వి మార్చాను. ఆ గుఱ్ఱపు వెంట్రుకలు సరిచేస్తే ఒక కమానుకు సరిపోతాయి. వయోలిన్కి బాగా పాలిష్ చేస్తే కొత్త దాన్ని మించి పోతుంది. వస్తువు పాతది కాబట్టి మంచి నాదం వస్తుంది. నీకు కానీ ఖర్చు లేకుండా వయోలిన్ బాగుచేసి పెడతాను."

నా అంత అదృష్టవంతుడు మరెవరూ లేదు.

పాత వయోలిన్ కనీసం అయిదువందల రూపాయలేనా చేస్తుంది.

నాలుగయిదు సంవత్సరాలు ప్రాక్టీసు చేసి, మంచి కండిషనులో వెంకట్రావుగారి వయోలిన్ వారికి ఇచ్చి వేయవచ్చు.

ఈ మంచి విషయం వెంకట్రావు గారికి చెప్పాలని మరునాడు ఉదయం వాళ్ళింటికి కెళ్ళాను.

లోపల హాలులో టేబిలు మీద వయోలిన్ పెట్టె ఉంది. వాళ్ళ అబ్బాయి దానిలో నున్న కమానును పైకి తీసి టేబిల్ మీద కొడుతున్నాడు. అది చూడగానే నాకు మతి పోయింది.

"రామం! రామం!! ఆ కమాను నేల కేసి కొట్టకు - విరిగి పోతుంది."

నా మాటలు నా నోట్లోనే ఉన్నాయి. ఆ పన్నెండేళ్ళ కుర్రాడు తన బలమంతా చూపి దానిని నేల కేసి కొట్టాడు. అది చివరను విరిగి పోయింది. నా మాటలు వినకుండా మళ్ళా కొడుతున్నాడు.

ఇంతట్లో వెంకట్రావు పంతులు గారు హాలులోకి వచ్చారు.

అతను నా మాటలు విన్నట్లున్నారు.

తండ్రిని చూసి కుర్రాడు పరుగు లంకించుకున్నాడు.

అతను కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ పెట్టెలోని వయోలిన్ తీసి వాడి మీదకి విసిరాడు.

వయోలిన్ రాతి స్తంభానికి తగిలి తునాతునకలయింది.

నేను చేష్టలు దక్కి పది నిమిషాల పాటు ఉండిపోయాను

తరువాత మెల్లగా అన్నాను:

"అయ్యా! ఎంత పని చేశారు! చాల విలువయిన వయోలిన్ను నాశనం చేశారు."

అతను నా వేపు తిరిగి కోపంతో గర్జించాడు

"వయోలిన్ ముక్కలయినందుకు నేను విచారించడం లేదు. నీ పీడ విరగడయి పోయినందుకు చాల హాయిగా ఉంది. మరి ఈ యింట్లో కాలు పెట్టకు."

* * *

గ్రంథాలయ వారోత్సవాలు పట్టణంలో జరుగుతున్నాయి. ఉత్సవాలలో ఆఖరి రోజున జిల్లా గ్రంథాలయం వారు కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. నలుగురు స్థానిక కవులను, పై గ్రామంలో నున్న నన్ను ఆ నాటి సభలో కావ్యగానం చేయడానికి ఎంచుకున్నారు. నాకు ప్రయాణం ఖర్చులకని డబ్బు పంపించారు. బసకు భోజనానికి అన్ని ఏర్పాటులు చేశామని వ్రాశారు. నా అంగీకారం తెలుపమని కోరారు.

నేను ఆహ్వానాన్ని అంగీకరించాను. నేను ఆఖరున గేయాలు చదువుతానని, నాకు అందరి కన్నా మరికొంచెం కాలం కేటాయించమని వారిని కోరాను. అంతే కాక, కర పత్రాలు అచ్చు వేస్తే, ఒక అయిదింటిని ఒక చిరునామాకి పంపమని వివరాలు తెలియజేశాను.

నాకు ఈ మధ్యనే నలభై ఒకటో యేడు వచ్చింది. అద్దంలో చూసుకుంటే ఇక్కడా అక్కడా నెరసిన వెంట్రుకలు కనిపించాయి. ఈ కాలంలో నెరసిన వెంట్రుకలకి భయపడనవసరం లేదు. అరవైకి పైబడ్డ వాళ్ళు కూడా బాలాకుమారుల్లా తుమ్మెద రెక్కల వంటి కురులతో దర్శనమిస్తున్నారు.

జీవితం చాల సాఫీగా సాగిపోతున్నది. వేళకు భోజనం. అన్ని విధాల మనస్సుకు ఆనందం కలిగించే పరిసరాల మధ్యనో చక్కని బంగళా, చదువుకునేందుకు నేను మెచ్చిన పుస్తకాలు, ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెట్టుకోడానికి పుష్కలంగా బ్యాంకులో డబ్బు. అడపా దడపా సన్మానాలు. ఈ విధంగా చెప్పుకు పోతుంటే ఎన్నో ఎన్నో దివ్య మైన పరిస్థితుల మధ్య జీవితం సాగిస్తున్నాను.

ఏ అర్థరాత్రో తెలివి వచ్చి టేబిలు దగ్గర కూర్చొని అదే పనిగా కవిత్వం వ్రాస్తాను. వ్రాసిన గీతాలను సానపట్టి, సానపట్టి పత్రికలకు పంపుతే వాటిని చాల మంది భావుకులు మెచ్చుకోడం, పత్రికాముఖంగా నన్ను అభినందించడం జరుగుతుంది.

అంతే కాక సభలలో నేను కావ్య గానం చేస్తే ప్రేక్షకులు హర్ష పులకితులై మేనులు మరుస్తారు.

నిజంగా ఒక్కమాటచెప్పాలి. తొలి రోజులలో చాల ఉబలాటంతో గీతాలైతే వ్రాసేవాడిని - కాని వాటిని చదివే నేర్పు - అది నేర్పు కాదు - పద్ధతి - అది తెలియక తికమకలు పడే వాడిని.

ఆ వ్యక్తి చెవుల్లో ఆనాడు నా గేయం పడక పోతే ఈనాడు శంకరానికి కవులలో స్థానముండేదికాదేమో!......

* * *

మా నాన్నగారికి విజయనగరం నుండి విశాఖ పట్నానికి బదిలీ అయింది. మేముండే యింట్లో రెండో వాటాలో వాళ్ళు అద్దెకు దిగారు. రెండు వాటాల వాళ్ళకి గదులు వేరయినా పెరడు మాత్రం ఒక్కటే.

అతను పోలీసు ఆఫీసులో మేనేజరుగా పనిచేస్తున్నారు. వాళ్ళది పెద్ద కుటుంబం కాదు. మొగుడూ, పెళ్ళాం, ఇద్దరు పిల్లలు. ఆడపిల్ల పెద్దది. కుర్రాడికి పన్నెండేళ్ళుంటాయి.

అప్పుడు నేను బియే పాసయి ఉద్యోగాల కోసం ప్రయత్నం చేస్తూ ఉండేవాడిని. విశాఖ పట్నంలో కొంత మంది స్నేహితులు దొరికారు. వాళ్ళలో కథానికలు వ్రాసేవారు. కవిత్వం చెప్పే వాళ్ళు ఉండేవారు. వాళ్ళతో పాటు సాహిత్య సభలకు హాజరవడం, ఉపన్యాసాలు వినడం, ఏ కవి బాణీ చదవడానికి బాగుంటుందని ఎంచుకోడం, దానిని అభ్యాసం చేయడం మొదలైన పనులు చేస్తూ ఉండే వాడిని. ఛందోబద్ధంగా పద్యాలు వ్రాసే వాడిని. లయానుసరణంగా గేయాలు రచించే వాడిని. వ్రాసిన వాటిని స్నేహితుల దగ్గిర చదివే ముందు బాగా కంఠస్థం చేసే వాడిని. దానికి కొన్ని ఇబ్బందులుండేవి. పెద్దవాళ్ళకు తెలియకుండా, మరెవరి చెవిని పడకుండా ఏకాంతంగా చదవవలసి వచ్చేది.

మా పక్క వాటాలో దిగిన వాళ్ళకి పూల మొక్కలున్నాయి. రమారమి ఒకడజను గోలాలు డాబామీదికి ఎక్కించారు. నేను సాయం వేళల్లో ఏకాంతంగా పద్యాలు చదువుకునే చోటనే వాటిని ఉంచారు. అంతే కాక వాటికి నీళ్ళు పోయడానికి ఎవరో రావడం, నా ఏకాంతం భగ్నమవడం జరిగేవి.

కవి మిత్రులం ప్రతి పదిహేను రోజులకు ఒకచోట సమావేశమయి రచనలు చదవడం చేస్తూ ఉండేవాళ్ళం. ఆ రోజు చీకటి పడింది. సమావేశం ఇంకా రెండు రోజులే ఉంది. వ్రాసిన రెండు కవితలు బాగా జ్ఞాపకమున్నాయి. వాటిని బాగా చదవడానికి, పూల మొక్కలకు దూరంగా, ఒక మూలను కూర్చున్నాను.

నా బాణీలో వాటిని చదువుతున్నాను.

ఇలా ఓ పదిహేను నిమిషాలు గడిచాయి.

"శంకరం గారూ! ఒక్కసారి చదవడం ఆపుతారా?"

నేనుతలెత్తి చూశాను.

ఆమె పోలీసాఫీసు మేనేజరు గారి కరూతురు.

"మీరు కవితలు వ్రాస్తారని మొన్ననే మీ అమ్మగారు చెప్పారు. కాని ఇంత చప్పగా చదువుతారని నేననుకోలేదు."

ఆ అమ్మాయి మాటలు విని నిశ్చేష్టుడనయాను.

"నా పద్యాలు బాగులేవా?" అవకతవకగా ప్రశ్నించాను.

"పద్యాలు బాగున్నాయి. చాల మంచి పదాలు వేశారు. చక్కని భావాలు గుబాళిస్తున్నాయి. కాని, మీరు చదివే తీరు, ఈ మంచి గుణాలనన్నిటినీ నాశనం చేస్తున్నది."

"నాకు బోధపడడం లేదు."

"మీరు ఛందస్సుకు ప్రాధాన్యమిచ్చి, యతి ప్రాసల దగ్గిర గొంతు తగ్గిస్తూ, ప్రతీ పాదం చివర ఆపుతూ భావాన్ని, భాషని ఖూనీ చేస్తున్నారు. ఈ విధంగా పద్యాలు చదువుతే ఎవరూ వినలేరని మీ స్నేహితులు చెప్పలేదా?"

"వాళ్ళలో వాళ్ళు నవ్వుకుంటున్నారు కాని, నిజం చెప్పడం లేదు"

ఇంత సేపూ ఆమె నిలబడే ఉంది. కూర్చోమని ఆమెకు చెప్పడానికి కూడా నాకు ధైర్యం చాలలేదు.

"మీరు చదవబోయే పద్యం చదవండి."

నేను పాడిపాడిగా పదాలు విడదీసి చదివాను.

"ఇంత మంచి పద్యాన్ని ఎలా చదవాలో తెలుసా?..."

తరువాత ఆమె చదివింది. నేను ఒళ్ళు మరచి విన్నాను. ఆ పద్యం నేనే వ్రాశానా అన్న సందేహం కలిగింది.

ఆ అమ్మాయి నే సమావేశంలో చదవబోయే రెండు కవితలు చదివి వినిపించిది. నన్ను ఆ విధంగా చదవమంది.

" మీ గొంతు వలె నాది మధురంగా ఉండదు" అన్నాను నేను.

"ఓ కవిగారూ ! భావం మీది! దానిని ఎంత రమ్యంగా బయట పెట్టాలో మీకే తెలుస్తుంది. మీ గళానికి వచ్చిన లోపమేదీ లేదు. చదవండి పద్యాలు."

ఆ విధంగా ఆ అమ్మాయి నన్నో మనిషిని చేసింది.....

* * *

హోటల్‌లో నాకో గది బుక్ చేశారు.

మిగిలిన కవి మిత్రులతో పాటు నాకు కూడా స్కూలు గదిలో బస యిమ్మన్నాను. నలుగురితో మాట్లాడుతూ కాలం గడిపితే జ్ఞాపకాలు నన్ను తరిమి వెంటాడవని అనుకున్నాను.

కాని, విధి మరోవిధంగా ఉంది.

మరి కొంత మంది ఉత్సవాలకు రావడం జరిగింది. వాళ్ళకి స్కూలులో బస యిచ్చి నన్ను హోటలు గదికి పంపారు.

మరునాడు సాయంకాలం నేను కావ్యగానం చేయాలి.

అంత వరకు విశ్రాంతి తీసుకుందామని అనుకున్నాను.

బసకే కాక, భోజనానికి కూడా హోటలులో సదుపాయంగా ఉండడం చేత పైకి పోవలసిన అవసరం కలుగలేదు. రాత్రి కొంచెం వేగంగా భోజనం చేసి బడలిక తీరడానికి మంచం మీద నడుం వాల్చాను.

బాగా నిద్ర పట్టేసింది.

ఎవరో అర్థరాత్రి నన్ను తట్టి లేపినట్లయింది

మెలకువ వచ్చి చుట్టూ చూశాను.

పైన ప్రకాశవంతంగా లైటు వెలుగుతోంది.

లేచి బట్టలు మార్చుకున్నాను.

దీపాలన్నీ ఆర్పేశాను.

మంచం మీద చేరబడ్డాను......

* * *

.......ఎక్కడో అడుగుల సవ్వడి

లయబద్ధంగా  గజ్జల మ్రోత

ఆమె అభినయిస్తోంది.

ఆనందభైరవి రాగం.

'మధురానగరిలో చల్లలమ్మబోను' - పదం

ఎవరో పాడుతున్నారు.

మరెవరూ అంత చక్కగా పాడలేరు.

ఆమె పాడుతూ అభినయం చేయగలదని అప్పుడే తెలిసింది.

పక్క వాద్యాలు లేవు.

హాలులో పాతిక మంది వరకు ఆడవాళ్ళు కూర్చున్నారు. అభినయం చూస్తున్నారు.

వరలక్ష్మి పూజ జరిగింది వాళ్లింట్లో.

సాయంకాలం పూజకు తెలిసిన ముత్తైదువులను పిలిచారు. వాళ్ళ కోరికను ఆమె కాదనలేదు.

వీధి వరండాలో ఒక కొట్టుంది. అది నా స్టడీ. అక్కడ నుంచి చూస్తే హాలులో చాల భాగం కనిపిస్తుంది. ఆమె నాట్యం చేస్తుంటే అప్పుడప్పుడు కనిపించకపోయినా మువ్వల మ్రోత మాత్రం నిరంతరాయంగా వినిపిస్తూనే ఉంది.

ఆమె జడ చాల పెద్దది

మొగలి రేకులు వేసి కుట్టారు.

అభినయంలో ఒక్కోసారి ఆ జడ త్రాచులా లేస్తోంది.

ఆమె శరీరం మన్మథుడు టంకారం చేసి అప్పుడే విడిచిన పుష్పధనువు.

నేను పరవశత్వంతో చూస్తున్నాను.

ఒకసారి ఆనాడు నేను పొందిన మధురమైన అనుభూతి గురించి ఆమెతో అంటే, జవాబుగా ఆమె పెదవులపై మల్లెలు విరిశాయి.

ఆమె నా మల్లిక

నా కవిత్వానికి మ్యూజ్.....

✹ ✹ ✹

ఈ జ్ఞాపకాలు ఒక వరుసను రావు ... ఒక క్రమంలో ఉండవు.

✹ ✹ ✹

...... ఒక సారి ఆమె మాటల సందర్భంలో చెప్పింది.

"మా నాన్నగారికి మూడేళ్ళకి, అయిదేళ్ళకి బదిలీలు తప్పవు. ఒక వూళ్ళో మూడు సంవత్సరాలున్నప్పుడు ఒక విఖ్యాత గురువు గారి దగ్గిర భరత నాట్యం నేర్చుకున్నాను. మరో ఊళ్ళో అయిదు సంవత్సరాలున్నాం. అప్పుడో సంగీత విద్వాంసుని దగ్గిర సంగీతం నేర్చుకున్నాను. మా నాన్న గారికి మంచి పలుకుబడి ఉండేది. గురువులు నాకు అరమరికలు లేకుండా విద్యలు గరపారు. ఇవన్నీ మా నాన్నగారి ప్రోత్సాహం వల్లే లభించాయి."

"అన్నీ బాగానే ఉన్నాయి. మరి చదువెందుకు మానేశావ్?"

" మా అమ్మ ఆరోగ్యం బాగా దెబ్బతింది. ఇప్పటికి కూడా ఆమె పరిస్థితి బాగులేదు. ఎదిగిన ఆడపిల్ల కాలేజీకి పోతే ఆమెకు పరిచర్య ఎవరు చేస్తారు? "నేను చదువుకోకపోయినా చింత లేదు. ..ప్రస్తుతం నీ గీతాలు చదువుతున్నాను కదా!".....

✹ ✹ ✹

ఏ జ్ఞాపకాలేనా క్రమం తప్పవచ్చు. కాని, ఒక్కటి మాత్రం చివరికే మిగులుతుంది.....

✹ ✹ ✹

..... పోలీసు మానేజరు గారు మాయింటి పక్కను దిగి సంవత్సరం దాటిపోయింది.

మా కుటుంబాల మధ్య స్నేహం బాగా పెరిగింది.

మానేజరు గారికి నేనంటే చాల అభిమానం.

మల్లిక అంటే మా అమ్మకు ప్రాణం.

మల్లికకు, నాకు మధ్య 'మీరు' 'మీరు' పోయి నువ్వు' ' నువ్వు' వరకు వచ్చింది.

ఉద్యోగాల కోసం పరీక్షలు రాస్తూనే ఉన్నాను. అవి చేతికందకుండా తప్పించుకుంటున్నాయి.

మానేజరు గారు అరకులోయను, కుటుంబంతో పోయి చూసి రావాలనుకున్నారు. ప్రకృతి సౌందర్యం, మల్బరీ తోటలు, లవంగ లతలు, ఇంకా చాలా చాలాచూసి రావడానికి నిశ్చయించారు. ప్రయాణానికి జీపు ఏర్పాటు చేశారు. మా కుటుంబాన్ని కూడా రమ్మన్నారు. తీరా బయలు దేరే వేళకు అటు మానేజరు గారికి, ఇటు మా నాన్న గారికి జరూరు పని ఉండడం చేత ఇద్దరూ ఉండి పోయారు. మరునాడు ఉదయం బస్సులో వస్తామని, మమ్మల్ని జీపులో పంపించారు.

సాయంకాలం అయిదు గంటలకు బయలు దేరిన జీపు రాత్రి తొమ్మిది గంటలకు గెస్టు హౌసు చేరింది. జీపు డ్రైవరు మమ్మల్ని దింపి వెళ్ళి పోయాడు.

మా కోసం గెస్టు హౌసులో రెండు గదులు బుక్ చేశారు.

గెస్టు హౌసు కేర్ టేకర్ అన్ని ఏర్పాటులు చేశాడు. స్నానాలకు వేడి నీళ్ళు సిద్ధంగా ఉంచాడు. వేడి వేడి భోజనం తయారు చేశాడు. స్నానాలు భోజనాలు ముగిసేసరికి పదకొండు గంటలయింది.

ప్రయాణం బడలికకి మా అమ్మ, మానేజరు భార్య, కొడుకు వారి వారి గదుల్లోకి పోయి మంచాల మీద వాలి పోయారు.

ఆమె, నేను మాత్రమే డైనింగ్ హాలులో మిగిలాం.

ఆ రోజు పున్నమి.

గెస్టు హౌసు చాల ఎత్తులో ఉంది.

"శంకరం, అలా వెన్నెలో తిరిగి వద్దామా?" ఆమె అంది.

ఇద్దరం వాలు దిగి, రోడ్డు పట్టి, మాట్లాడుకుంటూ నడిచాం.

గాలి లేదు. ఊరు దాటి పోయాం. చల్లదనం అంతటా వ్యాపించింది. వెండి వెన్నెలలు, చీకట్లు, లోయలో దోబూచులాడుకుంటున్నాయి.

ఇద్దరం రోడ్డు పక్కనున్న దిమ్మమీద కూర్చున్నాం.

మౌనంగా ఇద్దరం పది నిమిషాలు కూర్చున్న తరువాత ఆమె మాట్లాడింది.

"శంకరం! ఈ సంవత్సర కాలంలో మనిద్దరం చాల సన్నిహితులమయాం. మన మధ్య రహస్యాలంటూ లేవు. ఒకరి నొకరు అర్థం చేసుకున్నాం. ఈ ఏకాంత ప్రదేశంలో సూటిగా నిన్నొక ప్రశ్న వేస్తున్నాను . దైవం అనుకూలించి మనల్ని భార్యభర్తలుగా కలిపితే నా పట్ల ఎలా ప్రవర్తిస్తావు?"

నా దైవం తానుగా సాక్షాత్కరించింది.

ఆ దివ్య మైన క్షణంలో ఆమెకు ఏ జవాబూ చెప్పలేక పోయాను.

ఒక్క అయిదు నిమిషాల తరువాత ఆమె మళ్ళా పలికింది.

"ఏముంది? అందరి మగాళ్ళకు మల్లే బిడ్డలు కనే యంత్రాన్నిగా నన్ను మార్చి ఆనందిస్తావు. అంతేగా?"

ఆమె నవ్వుతూ, కవ్విస్తూ అంది.

వెన్నెలల వెలుగులు ఆమె ముఖాన్ని మరింత అందంగా తీర్చాయి

"మల్లికా! నిన్ను ఆరాధిస్తాను. అంతకు మించి మరి వేరే ఆలోచనే లేదు."

"నేనూ అదే అనుకుంటున్నాను. నువ్వు అందరి వంటి వాడివూ కావు!"

"మరో మంచి వార్త! ఇవాళ మధ్యాహ్నమే నాకు ఉద్యోగం ఆర్డర్లు వచ్చాయి. భగవంతుడు అనుగ్రహిస్తే మన వివాహానికి ఆటంకమంటూ ఉండదు."

ఆమె ఆనందంతో నా ముఖంలోకి చూసింది.

నన్ను తన బాహువులలో బంధించింది.

నా పెదవులను పెదవులతో అదిమింది.

నా శరీరంలో పులకలు వేస్తుంటే ఆమెను కౌగిలి లోకి తీసుకున్నాను.

ఆ స్థితిలో ఎంత సేపున్నామో!

చుట్టూ చల్లదనం - ఆమె శరీరంలో వెచ్చదనం.

పిండారబోసిన వెన్నెల.

పంచభూతాల సాక్షిగా ఇద్దరం ఒక మాటనుకున్నాం.

వివాహమంటే మనసుల కలయిక.

ఆ విధంగా మేము భార్యాభర్తలం.

సమాజంలో మేము దంపతులుగా తిరగాలంటే సాంప్రదాయాన్ని పాటించి అగ్ని సాక్షిగా మాకు వివాహం జరగాలి.

అంత వరకు నియమవంతులమై ఉండడానికి కృత నిశ్చయులమయాం.

* * *

ఇది ధర్మం....

మకరందంలోని మాధుర్యమే కాక సువాసన కూడా నా హృదయమంతా ఆక్రమించుకుంది.

ఈ ఆనంద తన్మయత నుండి నేను తెలివొందే సరికి ఉదయం ఆరు గంటలయింది. స్నానాదులు ముగించి తయారయే సరికి ఎనిమిదయింది.

తరువాత న్యూస్ పేపరు చూశాను.

'పట్టణంలో నేడు' శీర్షిక చూశాను. కవిసమ్మేళనం గురించి అందులో ఉంది. కావ్య గానం చేసే కవులలో నా పేరూ ఉంది.

కొంత మంది కవి మిత్రులను చూసి వద్దామనుకున్నాను.

కాని, ఏ పనీ చేయలేక పోయాను.

ఏదో దిగులు గుండెలను పిండుతూ ఉంది.

ఆమె సాయంకాలం సభకు వస్తుందో, రాదో అన్న సందేహం ముల్లులా హృదయంలో గుచ్చుకుంటున్నే ఉంది.

కాలం దొర్లింది.

సాయంకాలం సభలో వేదిక మీద ఇతర కవులతో కూర్చొని సావకాశంగా కుర్చీల వరుసలను పరిశీలించాను.

ఎక్కడా ఆమె కనిపించలేదు.

కాని, ఆమె స్నేహితురాలు ఒకరు రెండవ వరుసలో కనిపించారు.

అంతా నాకు అవగతమయింది.

నా వంతు కావ్య గానం చేసే వేళ వచ్చింది.

నాకిచ్చిన అరగంట వ్యవధి దాటిపోయింది.

అన్నీ మరచి చదువుతున్నాను.

ఎవరూ వద్దనలేదు. సభ విడిచి వెళ్ళిపోలేదు.

ఒక గంట తరువాత, చప్పట్ల మధ్య అందరికీ నమస్కారం చేసి కుర్చీలో కూలబడ్డాను.

ఏదో నీరసం నన్ను ఆవరించుకుంది.

సన్మానాలు బాగా జరిగినా, సభికుల మనస్సులు నేను దోచుకున్నా సంతోషం లేక పోయింది.

నా సందేశం ఆమె స్నేహితురాలి ద్వారా అందుతుందని మనస్సును సమాధాన పరచుకున్నాను.

ఆ రాత్రి నిద్ర సరిగా లేదు.

ఒక గాడిలో పోతున్న నా బ్రతుకు బండి బండరాళ్ళమీద నడిచింది.

హోటలు రూము మరొక రోజుకి తీసుకున్నాను.

సాయం కాలం నాలుగు వరకు చాల ఆందోళనతో గడిపాను.

ఇంత ప్రయత్నం చేసినా ఆమెను చూడగలనా అన్న సందేహం వెంట బెడుతూనే ఉంది.

చక్కగా పంచ కట్టుకుని, బహుమతిగా యిచ్చిన శాలువ పైన వేసుకుని వెళ్ళాలనిపించలేదు.

మామూలుగానే వెళ్ళాను. తల కూడా దువ్వుకోలేదు. నిద్ర లేక కళ్ళు లోతులకు పోయాయి.

వాళ్ళ యిల్లు ఎక్కడుందో ముందే తెలుసు. లేకపోతే కరపత్రాలు ఎలా పంపగలను.

తీరా అక్కడికి వెళ్ళిన తరువాత తెలిసిది. ఆ యింటి తలుపులు మూసే ఉంటాయని.

సందులోంచి వెళ్తుంటే ఆ యింటి కిటికీ ఒకటి బార్లా తెరిచింది కనిపించింది. కిటికీకి దగ్గర్లో ఆమె చిన్న బల్ల మీద కూర్చుంది. ఎనిమిదేళ్ళ అమ్మాయి ఆమె ముందు నిల్చుంటే జడవేయడం కోసం జుత్తు దువ్వుతున్నది.

నేను కిటికీకి సమీపంలో నిల్చున్నాను.

నా కోసమే ఆమె మాటి మాటికి ఎదురు చూస్తున్నట్లుంది. తల తిప్పి నన్ను చూసింది. వెంటనే పిల్లతో అంది:

"కాత్యాయని! తరువాత జడవేస్తా! వెళ్ళి ఆడుకో!"

అమ్మాయి వెళ్ళిపోయింది.

ఆమె కిటికీ ఊచలకు సమీపంలో కూర్చుంది. నేను రోడ్డు మీద దిగువకు ఉండడం చేత ఆమె కూర్చోవలసి వచ్చింది.

ఇవాళకి పదహారు సంవత్సరాలయింది. ఆమెను చూసి.

సర్వాంగసౌష్ఠవంగా నున్న ఆమె చాల చిక్కి పోయింది.

ఆ కళ్ళలో ఏవో చెప్పలేని వెలుగులు.

అప్రయత్నంగా నా కళ్ళంట నీళ్ళు కారడం మొదలయ్యాయి. గొంతు డగ్గుత్తిక పడింది. ఆమెను పలకరించడానికి కూడా నాలో శక్తి లేకపోయింది.

ఆమె కూడా కళ్ళ నీళ్ళు నింపుకుంది

వాడిన కపోలాల మీద పడుతున్న కన్నీటి బొట్లను చీర చెరగుతో ఒత్తుకుంది. ఆమె పెదవుల మీద పేద చిరునవ్వు చోటు చేసుకుంది. తర్జని ముక్కు మీద నుంచుకొని నన్ను ఏడవవద్దని సూచించింది.

"శంకరం! నువ్వు చాల ధైర్యవంతుడవనుకున్నాను!"

"మల్లికా!..."నూతిలోంచి వచ్చినట్లు మాటలు బయట పడుతున్నాయి.

"ఇవాళకి పదహారు సంవత్సరాలయింది. మనం ఏకాంతంగా అరకులోయలో కలుసుకొని.'

ఆమె ఏమీ గమనించినట్లు లేదు. ఆమె భర్త ఎలాంటి వాడో నేను చూసి ఎరుగను.

అతనెవరో గదిలోకి ప్రవేశించి లోపలి గోడ దగ్గర నిలబడి సంభాషణ వింటున్నాడు.

ఆమెకీ సంగతి చెప్పాలని ప్రయత్నించాను. సంజ్ఞ చేయడానికి తొందరపడ్డాను. నా కళ్ళ ఎదుట ఆ పెద్దమనిషి వేయి కళ్ళతో మమ్మల్ని పరిశీలిస్తుంటే ఏం చేయను?

ఆమె కీ సంగతి తెలుసో లేదో - కాని ఆమె ఏమీ పట్టించుకున్నట్లు లేదు. ఆమె ముఖంలో ఏ విధమైన తొట్రుపాటు లేదు.

"పదహారు సంవత్సరాల క్రింద, అరకులోయలో, పున్నమి వెన్నెలలో నా హృదయం, నా శరీరం నీకు అర్పించుకున్నాను. నా హృదయాన్ని స్వీకరించావు. ఆ ఉద్రేకంలో నువ్వు తప్పు దారి తొక్కినా బాగుండేది. ఏ కడుపో, కాలో వస్తే మనిద్దరికీ తప్పక పెళ్ళి జరిగేది."

"మల్లికా! నేను ..." చెప్పలేక పోయాను.

"నువ్విటువంటి తప్పు పని చెయ్యవని తెలుసు. అందుకే నువ్వంటే నాకు ఎంతో ఇష్టం. నువ్వంటే నాకు ఎనలేని గౌరవం."

గోడ దగ్గిర మనిషిలో కదలిక కనిపించింది.

"నీకు ఉద్యోగం దొరకడం, మా అమ్మకు పీకల మీదకిరావడం, మా అమ్మతమ్ముడు అందుబాటులో ఉండడం- ఇవన్నీ మన కలల్ని నాశనం చేశాయి."

ఈ పరమ సత్యాలకు తలొగ్గడం తప్ప నా దగ్గిర జవాబు లేదు.

"శంకరం! నిన్నొక ప్రశ్న వేస్తున్నాను. ఇటువంటి పరిస్థితులు నీకే వచ్చి, నువ్వు మరో అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే, నేనేం చేసే దాన్నో తెలుసా?". ఆమె చాల ఉద్రేకంతో మాట్లాడుతున్నది.

"మల్లికా!...."

"నాకా వార్త తెలిసిన వెంటనే ఉరిపోసుకొని చచ్చే దాన్ని"

"అటువంటి మాటలనకు మల్లికా! .. నిన్ను చూడాలని బ్రతికి ఉన్నాను - "

"ఇప్పుడా సంగతులేవి మాట్లాడుకోవద్దు. ఈ కొద్ది కాలంలో మంచి సంగతులు చెప్పు... మరెందుకు నువ్వు పెళ్ళి చేసుకోలేదు..."

"మరొకరికి హృదయం ఇవ్వలేక కాపరం చేయడం కంటే నిన్ను తలచుకొని జీవించడమే మేలనుకున్నాను."

"మరి దొరికిన ఉద్యోగం ఎందుకు వదిలేశావ్?"

"నేనీ అఘాయిత్యానికి తట్టుకోలేక పోయాను. దేశ మంతా పర్యటించాను. నీ మధురమైన వాక్కు నా చెవులలో మార్మోగుతుండేది. నీవు నేను కలిసి పాడిన గేయాలు నన్ను ముసురుకునేవి. క్రమంగా కాలం ప్రభావానికి లొంగి, తెలుగు సాహిత్యంలో కృషి చేయాలని యూనివర్సిటీలో చేరాను. నువ్వు సరస్వతీ దేవివై నన్ను నడిపించావు. పెద్ద చదువు, మంచి లెక్చరరు ఉద్యోగం నీ చలువ వల్లే లభించాయి. నిరంతరం నా హృదయాన్ని విడువకుండా సహకరించావు. నేడు ఇలా ఉండడం నిన్ను గురించే."

"అవును. నీ కిచ్చిన చేదు మాత్రని ఈ ప్రేమ అనే తేనెలో రంగరించుకున్నావు."

"మల్లికా! నేను పంపిన కరపత్రాలు నీకందలేదా?'

" పోస్టు మాను ఇచ్చాడు. కాని, నాకా కవరు, కరపత్రాల ముక్కలు వీధిలో అరుగు

పక్కన కనిపించాయి. దినపత్రికలో కూడా చూశాను. నాకు నీ కావ్యగానం గురించి అంతా తెలిసింది.''

"మనిద్దరం కలిసి గానం చేసిన కవితలను "నవమల్లిక" అన్న పేరుతో సంపుటంగా వేశాను. ఆ పుస్తకాన్ని నీకు అంకితం చేశాను. నీకు రిజిస్టరు పోస్టులో పంపితే, 'పార్టీ నిరాకరించారు' అంటూ నాకు తిరిగి వచ్చింది.

"అందులో ఆశ్చర్య పోడానికి అవసరం లేదు - అంతా నీకు తెలుసు. ఆ కవితలు నేను మరచి పోయాననుకున్నావా. నా మనసులోనే పాడుకుంటాను.''

" మల్లికా! నువ్వు సంగీతం లోను, నాట్యంలోను అద్వితీయమైన సాధన చేశావు. నలుగురు అమ్మాయిలను చేరదీసి వారికీ విద్యలు నేర్పితే వాళ్ళలో మల్లికను చూసుకుందుమే!'

"అదే మరి. చక్కని రెమ్మ చిగిర్చి పూలు పూస్తుందని తెలియగానే వాళ్ళు, చివుళ్ళను కాదు, రెమ్మనే విరిచేశారు. నా కోరికను సమూలంగా నాశనం చేశారు. నా గొంతును బలవంతంగా పిసికారు. నా శరీర భాగాలను చచ్చు పడజేశారు.'' ఆమె చాల ఉద్రేకంతో చెప్తున్నది.

"నిన్ను పంజరంలో పెట్టి బంధించారు.'

"నేనూచాలకాలం అలా అనుకునేదాన్ని. కాని, నాకీ పంజరంలో క్రమంగా స్వేచ్ఛ కనిపించింది. ఏకాంతంగా ఆలోచించుకోమని నన్ను వదిలి పెట్టారు. ఇప్పుడు నాకేమని పిస్తోందో తెలుసా?''

"చెప్పు"

"మీరందరూ, నాకీ ఊచలలోంచి చూస్తుంటే, పెద్ద పంజరంలో కొట్లాడుతున్నట్లు తోస్తుంది...'

గుండెలలో గునపాలు గుచ్చుతున్నారు.

"శంకరం!...." ఆమె మరి భరించలేక పోయిది. ఒక్కసారిగా రోదించింది. బెక్కుతోంది. బాష్పధారలు చీర చెరగుని తడిపేస్తున్నాయి. ఇంత వరకు ఆమె ధరించిన ధైర్యపు ముసుగు తునాతునకలయింది.

"మల్లికా!....." గట్టిగా పిలిచాను.

నా కళ్ళ నిండా కుండలతో నీళ్ళు. లోకమంతా చెదిరిపోతోంది.

నేను కళ్ళు తుడుచుకొని కొంతసేపటి తరువాత చూశాను.

ఆ కిటికీ తలుపులు శాశ్వతంగా మూసుకున్నాయి.

(రచన - 1993)